క్లుప్తంగా

తరుణ్‌కు స్కేటింగ్‌లో రజత పతకం


రజత పతకం సాధించిన ఒమ్మి తరుణ్

కొమ్మాది: కాకినాడ జిల్లాలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి ఏపీ స్టేట్ ఓపెన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్–2024 పోటీల్లో (5, 7 సంవత్సరాల విభాగంలో) ఫ్రెండ్స్ రోలర్ స్కో అసోసియేషన్‌కు చెందిన ఒమ్మి తరుణ్ ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకున్నాడు. ముందుగా విశాఖలో జరిగిన జోనల్–3 ఛాంపియన్‌షిప్ స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో విజేతగా నిలిచి బంగారు పతకం సాధించాడు. ఈ క్రమంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై రింగ్–5, రింగ్–6 లో ప్రతిభ ప్రదర్శించాడు. గతంలో స్థానిక అసోసియేషన్‌లో జరిగిన పోటీల్లో సైతం పలు పతకాలు కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా తరుణ్‌ను అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ చంద్ర తదితరులు అభినందించారు.

బాల్యం నుంచి క్రమశిక్షణ అవసరం


మాట్లాడుతున్న ద్వారకా ఏసీపీ రాంబాబు

కొమ్మాది: బాల్యం నుంచే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో మెలగాలని ద్వారక ఏసీపీ ఎస్.రాంబాబు అన్నారు. బీచ్ రోడ్డు రుషికొండలోని గాయత్రి కళాశాలలో ఉత్తరాంధ్ర జిల్లాల ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలు ట్రాఫిక్ రూల్స్, డ్రగ్స్ నియంత్రణపై పలు అంశాలను ఎన్‌సీసీ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో 13వ బెటాలియన్ ఎన్‌సీసీ ఆర్మీ వింగ్ కమాండింగ్ ఆఫీసర్ నీరజ్ కుమార్, సీఐ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

నాగవంశ సంక్షేమ కమిటీ ఎన్నిక


బాధ్యతలు స్వీకరిస్తున్న కమిటీ సభ్యులు

భీమునిపట్నం: భీమిలిలో నాగవంశ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక మంగళవారం నిర్వహించారు. నాగవంశ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు సమక్షంలో, వారి కుల దైవం మరిడమ్మవారి ఆలయం వద్ద ఈ ఎన్నిక జరిగింది. ఇందులో కమిటీ అధ్యక్షునిగా కంటుభుక్త ముత్యాలరావు, ఉపాధ్యక్షుడిగా అప్పికొండ నూకరాజు, కార్యదర్శిగా గాడు సన్యాసినాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కనకల సన్నిబాబు, సహ కార్యదర్శిగా లచ్చు బుగత గణపతిరావు, కోశాధికారిగా సంకురుబోతు జోగారావు, కో–ఆర్డినేటర్‌గా కనకల అప్పలనాయుడు తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గీతం సైన్స్ డీన్‌కు ప్రతిష్టాత్మక ఐజీయూ అవార్డు

కొమ్మాది: భౌతిక శాస్త్రవేత్తలకు ఇండియన్ జియోఫిజికల్ యూనియన్ (ఐజీయూ) ఏటా ప్రకటించే ప్రతిష్టాత్మక హరి నారాయణ్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు–2024 కు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ ఎంపికయ్యారు. మెరైన్ జియో ఫిజిక్స్‌లో జరిపిన విశిష్ట పరిశోధనలు గుర్తిస్తూ ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు జాతీయ స్థాయి సెలక్షన్ కమిటీ ప్రకటించినట్లు గీతం ఇన్‌చార్జ్ వీసీ వై.గౌతమ్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు.

ముగిసిన అంత్యక్రియలు

తగరపువలస: తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా కొత్తకోటలో ఇటీవల హత్యకు గురైన భీమిలి మండలం కొత్త మూలకుద్దు వాసి కొయ్య వెంకట అప్పన్నరెడ్డి అంత్యక్రియలు ఆయన స్వగ్రామంలో మంగళవారం ముగిశాయి. గత వ్యాపార భాగస్వామి బత్తిన ద్వారకానాథ్ రెడ్డి నుంచి రావాల్సిన డబ్బులు వసూలు చేసుకునేందుకు కొత్తకోట వెళ్లగా .. అక్కడ కిరాయి హంతకుల చేతిలో ఈ నెల 4న అప్పన్నరెడ్డి హత్యకు గురైన విషయం తెలిసిందే.

అలంకారప్రాయమే..

- రోడ్డు విస్తరణలో పగిలిన పైపులైన్
- రెండు పంచాయతీలకు అందని తాగునీరు
- ఇంటింటి కుళాయిలున్నా నిరుపయోగం
- రెండేళ్లుగా ఇదే పరిస్థితి


వృథాగా ఉన్న వాటర్ ట్యాంక్


రాజీవ్ నగర్‌లోనూ అదే పరిస్థితి


కోమటి వీధిలో నిరుపయోగంగా ఉన్న కుళాయి

పద్మనాభం: మండలంలోని రెండు పంచాయతీల్లో తాగునీటి కుళాయిలు అలంకారప్రాయంగా మారాయి. రెడ్డిపల్లి రోడ్డు విస్తరణలో భాగంగా ఈ రోడ్డు పక్కన ఉన్న తాగునీటి పైపు లైన్‌ను తవ్వేయడంతో పైపు పగిలిపోయింది. ఈ పైపులైనుకు అనుసంధానంగా శేరిఖండంలో వంద, రెడ్డిపల్లిలో 500 ఇంటింటి కుళాయిలు ఉన్నాయి. వాటి నుంచి రెండేళ్లుగా చుక్క నీరు కూడా సరఫరా కావడం లేదు. దీంతో ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారు.

పద్మనాభం పంచాయతీ ఇసకలపాలెంలో గోస్తని నదిలోని బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఈ గ్రామాలకు పైపు లైన్ వేశారు. ఈ మెయిన్ పైపు లైను నుంచి అంతర్గత పైపు లైన్ ద్వారా కుళాయిల నుంచి ప్రజలకు తాగు నీరు సరఫరా చేసేవారు. రెడ్డిపల్లి మేజర్ పంచాయతీ కావడంతో ఈ గ్రామంలో సుమారు రెండు లక్షల లీటర్ల నీటి సామర్థ్యం గల వాటర్ ట్యాంకును నిర్మించారు. ఈ ట్యాంకులోకి పైపు లైన్ ద్వారా వచ్చిన నీటిని ఇక్కడి నుంచి కుళాయిలకు పంపేవారు. మెయిన్ పైపులైన్ పోవడంతో మొత్తం కుళాయిలన్నీ చుక్క నీరు ఇవ్వక నిరుపయోగంగా పడి ఉన్నాయి. దీంతో రెడ్డిపల్లిలో కొంతమంది ప్రైవేట్ వ్యక్తుల ఇళ్ల బోర్ల వద్ద నుంచి నీరు తెచ్చుకుని గొంతు తడుపుకొంటున్నారు. మరికొందరు తప్పని పరిస్థితుల్లో ప్రభుత్వ బోర్ల వద్ద చాలీ చాలని నీటితో దాహార్తి తీర్చుకుంటున్నారు.

చేరిఖండంలో ప్రైవేటు వ్యక్తుల ఇళ్ల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుందామన్నా ఈ బోర్ల ద్వారా సుద్ద నీరు రావడంతో తాగడానికి పనికి రావడంలేదు. క్యాన్ రూ.10కు మినరల్ వాటర్ తెచ్చుకుని తాగు నీటి అవసరాలు తీర్చుకుంటున్నారు. పైపులైన్ బాగు చేయించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశంలో రెడ్డిపల్లి, శేరిఖండం కోరినా ప్రయోజనం లేకపోయింది. దీంతో రెండు పంచాయతీల ప్రజలకు తాగునీటి అవస్థలు తప్పడం లేదు.

బోరు నీటితో గొంతు తడుపుకొంటున్నాం



పైపులైన్లు పగిలిపోవడంతో నీటి కష్టాలు మళ్లీ మొదటికి వచ్చాయి. ఇంటింటి కుళాయిలు ఉన్నా వృథాగానే మిగిలాయి. వేరే చోట తెచ్చుకుందాము అనుకున్నా సుద్దనీరు రావడంతో తాగడానికి పనికిరావడం లేదు. హైస్కూల్ బోరు వద్ద వెళ్లి నీరు తెచ్చుకుని గొంతు తడుపుకొంటున్నాం. – వి.ఆదిలక్ష్మి, శేరిఖండం

నీటికి చాలా ఇబ్బంది పడుతున్నాం



పైపులైన్ పగిలిపోయిందని చాన్నాళ్లుగా కుళాయి నీరు రావడం లేదు. ప్రభుత్వ బోరుబావులు ఉన్నా అవి సరిపోవడం లేదు. తాగు నీటికి చాలా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు మా కష్టాలు తీర్చాలి. – సి.హెచ్.అప్పలకొండ, కోమటి వీధి, రెడ్డిపల్లి

మా గోడు పట్టించుకోండి సారూ..



రోడ్డు విస్తరిస్తున్నప్పుడు పైపులైన్ పోయింది. అప్పటి నుంచి దాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆ కాంట్రాక్టరూ దాని ఊసెత్తడం లేదు. బోరు నీరు సరిపోవడం లేదు. ఇంకెన్నాళ్లు మాకీ నీటి కష్టాలో తెలియడం లేదు. ఇప్పటికైనా మా గోడు పట్టించుకోండి సారూ.. గుక్కెడు నీరిచ్చి మా గొంతు తడపండి చాలు. – ఐ.కొండమ్మ, ఎస్సీ కాలనీ, రెడ్డిపల్లి

నేత్రపర్వం.. అమ్మరూపం


చంద్రంపాలెంలో హోమం నిర్వహిస్తున్న మహిళలు


తులసిమాలలు బంతిపూల అలంకరణలో రాసపోలమాంబ


ప్రత్యేక అలంకరణలో కొత్తమ్మ


వారాహి దేవి అలంకరణలో దుర్గమ్మ


నవదుర్గా పీఠం భవానీల ఘటాల ఊరేగింపు

తగరపువలస: శరన్నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారు శ్రీమహలక్ష్మిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పలుచోట్ల మండపాలు, ఆలయాల వద్ద కరెన్సీ దండలు వేశారు. కుంకుమ పూజలు, చండీహోమం నిర్వహించారు. మజ్జివలస పంచాయతీలో రాసపోలమాంబ అమ్మవారికి సంతపేటకు చెందిన రాజు, లక్ష్మిల సహకారంతో తులసిమాలలు, బంతి పూలతో అలంకరించగా తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

స్థానిక శ్రీవాసవి క్లబ్ మహిళా ప్రతినిధులు మంగళవారం కొత్తమ్మతల్లి ఆలయంలో సామూహికంగా శ్రీలలితా సహస్రనామ పారాయణ చేశారు.

భవానీల ఘటారాధన

గణేష్ థియేటర్ కూడలి వద్ద నవదుర్గా భవానీ పీఠానికి చెందిన భవానీలు ఘటారాధన చేశారు. పీఠం నుంచి మొదలుకుని గ్రామాలలో ఊరేగింపు నిర్వహించి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

శ్రీ మహాలక్ష్మిగా బబ్బేలమ్మ

పీఎం పాలెం: కారుషెడ్ దరి బబ్బేలమ్మ మంగళవారం శ్రీ మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ మండపంలో ఉదయం, సాయంత్రం అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

వారాహి దేవిగా దుర్గమ్మ

కొమ్మాది: ఎండాడలోని దుర్గమ్మ ఆలయంలో అమ్మవారు శ్రీమహాలక్ష్మి (వారాహి)గా దర్శనమిచ్చారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని, అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించారు.

మహాలక్ష్మిగా పద్మావతి అమ్మవారు

భీమునిపట్నం: స్థానిక కృష్ణా కాలనీ కొండపైనున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో పద్మావతి అమ్మవారు మంగళవారం మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. భక్తులు సహస్ర కుంకుమార్చన, లలితా హోమంలో పాల్గొన్నారు.

మహాలక్ష్మిగా దుర్గాలమ్మ

మధురవాడ: జాతర గట్టు చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. మూల విరాట్‌కు పంచామృత సుగంధ అభిషేకాలు నిర్వహించారు. సహస్ర కుంకుమార్చన, విశేష హోమం జరిపించారు.

ఆధ్యాత్మిక చింతనతో ఉన్నతి


దీపాలు వెలిగిస్తున్న మహిళలు

- సీపీ శంఖబ్రత బాగ్చి
- మధురవాడలో అఖండ దీపారాధన ప్రారంభం


మధురవాడ టైలర్స్ కాలనీలో అఖండ దీపారాధనను ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

మధురవాడ: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. మధురవాడ టైలర్స్ కాలనీలోని విజయదుర్గా దేవి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో మంగళవారం రాత్రి పాల్గొన్న ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అఖండ దీపారాధనను ప్రారంభించిన అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. మనం చేసే ఎలాంటి కార్యకలాపాలకైనా ఆలోచనలే ఆధారమన్నారు. మంచి ఆలోచనలు సత్సంకల్పాలకు మార్గం చూపుతాయన్నారు. ఆలోచనలకు ఆధ్యాత్మికత తోడైతే ఆత్మాన్వేషణ దిశగా మరలుతాయన్నారు. అందుకు ప్రతి ఒక్కరిలో భక్తి భావం పెంపొందాలన్నారు. మొదట ఆయనకు ఆలయ ధర్మకర్తలు బంగారు సుబ్బారావు, లక్ష్మి దంపతులు, అర్చకుడు శ్రీకాంత్ శర్మ తదితరులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు బంగారు ప్రకాశ్, బంగారు అశోక్, ఝాన్సీ దంపతులు, తెంటు మాధవి, భరణ్‌కుమార్, కౌశిక్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త వంగడాలతో అధిక దిగుబడులు


శిర్లపాలెంలో వరిలో తెగుళ్ల గురించి అవగాహన కల్పిస్తున్న ఏవో సంధ్యా రత్న ప్రభ


కోరాడలో వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

తగరపువలస: రైతులు రెండో పంటగా కొత్త పోర్టిఫైడ్ రాగి వంగడాలను నాటే పద్ధతిలో వేసుకోవడం వలన 15 నుంచి 18 క్వింటాళ్ల అధిక దిగుబడులతో పాటు గిట్టుబాటు ధర పొందవచ్చని వ్యవసాయశాఖ భీమిలి ఏడీ విజయప్రసాద్ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆనందపురం మండలం పేకేరు, శిర్లపాలెం పంచాయతీలలో రైతులకు మంగళవారం పలు విషయాలపై అవగాహన కల్పించారు. రైతులంతా సమీకృత వ్యవసాయం చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన పంటలు సాగు చేయవచ్చన్నారు. మండల వ్యవసాయాధికారి చావా సంధ్యా రత్నప్రభ మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు వినియోగించడం వలన చౌడు నేలలు నివారించుకోవచ్చన్నారు. వరిలో పురుగులు, తెగుళ్ల నివారణ గురించి తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయంలో పంటలు పండించే విధానం, తెగుళ్ల నివారణకు కషాయాలు గురించి శ్రీనివాస చక్రవర్తి తెలిపారు. వ్యవసాయశాఖ సహాయకులు దిలీప్ చక్రవర్తి, రమేష్ పాల్గొన్నారు.

అరటి సాగుకు రాయితీ

జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ, నిడిగట్టు పంచాయతీలలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా ఉద్యానవనశాఖ అధికారి కె.సత్యనారాయణరెడ్డి పలు అంశాలపై అవగాహన కల్పించారు. టిష్యూ కల్చర్‌లో అరటి మొక్కలు వేసే రైతులకు మొక్కలు, ఎరువుల కోసం 2.50 ఎకరాలకు మొదటి ఏడాది రూ.30వేలు, రెండో ఏడాది రూ.10వేలు నిర్వహణ ఖర్చుల కింద అందిస్తామన్నారు. మండల వ్యవసాయాధికారి బి.శివకోమలి మాట్లాడుతూ వరి ప్రస్తుతం కంకుల దశ నుంచి పొట్ట దశలో ఉన్నందున తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. పీఎం కిసాన్ కోసం ఆధార్ యాక్టివేషన్ చేయించుకోవాలన్నారు. రబీలో నువ్వులు, రాగులు, అపరాల విత్తనాలు అవసరమైన రైతులు పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు. తాళ్లవలస పశు వైద్యాధికారి ప్రశాంతి మినరల్ మిక్స్చర్, మినీ గోకులం షెడ్లు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఏడీఏ భ్రమరాంబ, సహాయ సిబ్బంది స్రవంతి, శివప్రసాద్, వాసంతి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి

పద్మనాభం: రైతులు వరి పంటకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీ చదువుల సుబ్రమణ్యం సూచించారు. మండలంలోని కోరాడ, బి.ఆర్.తాళ్లవలస గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వరి పంటకు ఆకుముడత ఆశించిందన్నారు. దీని నివారణకు ఎసిపేట్ 250 గ్రాముల మందును 200 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమాల్లో ప్రకృతి వ్యవసాయం డీపీఎం ఎ.మోహనరావు, కోరాడ సర్పంచ్ కోరాడ లక్ష్మణరావు, ఏవో ఎంవీఎస్ చలం, ఉద్యానవన శాఖ అధికారిణి స్వాతి పాల్గొన్నారు.

రోడ్డు మధ్య డస్ట్‌బిన్

- రోడ్డు పక్కన అనధికార బడ్డీలు
- జీవీఎంసీ జోన్–2లో పరిస్థితి


నగరంపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు మధ్యలో ఉన్న డస్ట్‌బిన్


నగరంపాలెం రోడ్డులో పుట్ట గొడుగుల్లా అనధికార బడ్డీలు

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్–2 పరిధిలోని 5, 6, 7 వార్డుల్లో అనధికారిక బడ్డీలు ఎక్కడికక్కడే వెలుస్తున్నాయి. మారికవలస ఆర్‌జీకే కాలనీ, మారికవలస, కొమ్మాది జంక్షన్లతో పాటు శివశక్తి నగర్, నగరం పాలెం రోడ్డు, మధురవాడ డైలీ మార్కెట్, పీఎం పాలెం రోడ్డు, మిథిలాపురి ఉడా కాలనీ తదితర రహదారుల్లో ఫుట్ పాత్, రోడ్డు పక్కల్లో వందల సంఖ్యలో అనధికార బడ్డీలు, తోపుడు బళ్లు పెరిగిపోయాయి. వీటి పరిస్థితి ఎక్కడి వరకు వెళ్లిందంటే .. డస్ట్ బిన్లు, ఇతర చెత్త తరలించాల్సిన వాహనాలు, తోపుడు బళ్లు ఉండాల్సిన స్థలాలను కూడా వారే ఆక్రమించేశారు. ప్రస్తుతం డస్ట్‌బిన్లకు స్థలం లేక రోడ్డు మీదకి వచ్చాయి. మరికొందరు తమ బడ్డీకి అడ్డుగా లేకుండా పక్కకి తరలించే పనులకు పూనుకుంటున్నారు. ఇదే విధంగా మధురవాడ డైలీ మార్కెట్‌లో జరిగింది. డస్ట్ బిన్ రోడ్డు మీదకు రావడంతో ట్రాఫిక్ అడ్డం కావడంతో దాన్ని వేరే ప్రాంతానికి తరలించారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మండపాల వద్ద అన్న సమారాధనలు


బాలాజీనగర్ మండపం వద్ద అన్న సమారాధన ప్రారంభిస్తున్న ప్రసాద్

తగరపువలస: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం పలు మండపాల వద్ద నిర్వాహకులు అన్న సమారాధనలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు బాలాజీనగర్‌లో ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ జీవీఎంసీ ఒకటోవార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్ ప్రారంభించారు. భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ కొత్తూరు, సంతపేట కొత్తమ్మతల్లి ఆలయం, ఎల్లారమ్మ మెట్టపై అమ్మవారి ఆలయంలో నారాయణ సేవ నిర్వహించారు.

అన్నదాతలకు సత్కారం


కొత్తమ్మతల్లి ఆలయం వద్ద అన్నదాతలను సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు సంతపేట కొత్తమ్మతల్లి ఆలయంలో అన్నదాతలను ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళవారం సత్కరించారు. అమ్మవారి చిత్రపటం అందించి, శాలువాతో సన్మానించారు. ఆలయంలో అన్నప్రసాదాల పంపిణీ ప్రారంభించి 10 వారాలు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అలాగే పదేళ్లుగా అమ్మవారిని అలంకరిస్తున్న పినిశెట్టి రమణమ్మ, మేకల జానకి, నార్ల సూర్యకళలను కూడా సత్కరించారు. బండారు శంకరరావు అనే వ్యాపారి అమ్మవారి చిత్రపటాలను తయారు చేయించి బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు రంగూరి సీతారామదొర, చేట్ల త్రినాథరెడ్డి, నందిక రమణ, పిట్ట వెంకటరావు, దుంప శంకరరావు, చేట్ల గురుమూర్తిరెడ్డి, చేట్ల రమణ, నందిక శ్రీను, పట్నాల రాము తదితరులు పాల్గొన్నారు.

బియ్యం, సరకుల వితరణ


సరకులు అందిస్తున్న తెలగా సేవా సంఘం ప్రతినిధులు

తగరపువలస: స్థానిక తెలగా సేవా సంఘం ప్రతినిధులు మంగళవారం సంతపేటలో కొత్తమ్మతల్లి ఆలయ మహిళా పూజారికి బియ్యం, నిత్యవసర సరకులు అందించారు. సంఘం అధ్యక్షుడు రంగూరి రాంబాబు, గిరిధర్, శ్రీనివాసరావు, పిట్టా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మాతృ మరణాలు సంభవించరాదు

మహారాణిపేట: జిల్లాలో మాతృ మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. మాతృ మరణాలపై మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం జూలై నుంచి సెప్టెంబర్ వరకు జిల్లాలో 4 మాతృ మరణాలు సంభవించాయని, వీటిలో రైల్వే న్యూకాలనీ పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో ఒకటి, స్వతంత్ర నగర్ పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో ఒకటి, బుచ్చిరాజుపాలెం పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో ఒకటి, దుర్గా బజార్ పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో ఒకటి సంభవించాయన్నారు. గర్భిణులకు సమయానుకూలంగా వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించటం, పోషకాహారం తీసుకోవాలని అవగాహన కల్పించాలన్నారు. రక్తహీనత ఉంటే వారికి ఐరన్ ఫోలిక్ టాబ్లెట్లు ఇవ్వడం, హైరిస్క్ గర్భిణులను గుర్తించి డాక్టర్ల వద్దకు తీసుకెళ్లి వైద్యం అందేటట్లు చూడాలని తెలిపారు. గుండె జబ్బులు ఉన్నవారిని గుర్తించి వెంటనే రిఫరల్ ఆస్పత్రికి తరలించాలన్నారు. సమావేశంలో జిల్లా ఆస్పత్రి సమన్వయ అధికారి డాక్టర్ శంకర్ ప్రసాద్, వివిధ విభాగాల అధికారులు డాక్టర్ బి.ఉమావతి, కేజీహెచ్ గైనిక్ విభాగాధిపతి డాక్టర్ కె.వి.ఎస్.ఎం. సంధ్యాదేవి, గైనకాలజిస్ట్, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషా ప్రసాద్, వైద్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్టాంపుల ప్రదర్శన


స్టాంపులను తిలకిస్తున్న ప్రజలు

సీతంపేట : నేషనల్ ఫిలాటలీ డే సందర్భంగా హెడ్ పోస్టాఫీస్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయం ఆవరణలో మంగళవారం స్టాంపుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. వివిధ సందర్భాల్లో ప్రత్యేకంగా ముద్రించిన, అరుదైన స్టాంపులను ప్రదర్శనలో ఉంచారు. పౌర గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు ప్రదర్శన తిలకించి స్టాంపుల వివరాలు, ప్రత్యేకత తెలుసుకున్నారు. అక్కినేని శత జయంతి వేడుకల సందర్భంగా ప్రత్యేకంగా ముంద్రించిన స్టాంపు, పారిస్ ఒలింపిక్స్, అయోధ్య శ్రీరామ జన్మభూమి టెంపుల్, అగ్రికల్చరల్ గూడ్స్, ఇండియా – ఒమన్ దేశాల మైత్రి, ఇండియా – ఈజిప్ట్ 75 ఏళ్ల మైత్రి సందర్భంగా పోస్టల్ శాఖ విడుదల చేసిన స్టాంప్స్ ఆకట్టుకున్నాయి. ఇక్కడ ప్రదర్శించిన స్టాంపులు వాడుకకు దొరకవని, కేవలం సేకరణకర్తలకు ప్రత్యేక ముద్రిత స్టాంపులు అందజేస్తామని పోస్టల్ సిబ్బంది వెంకటేష్ తెలిపారు. ఏ స్టాంపు ఎప్పుడు విడుదల చేశారు వంటి విషయాలు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు బాగా ఉపకరిస్తాయని తెలిపారు.